క్లుప్తంగా

యడ్లపాడు-1 ఇన్‌చార్జి వీఆర్వోగా కేపీ చారి



యడ్లపాడు: సస్పెండైన వ్యక్తి స్థానంలో మరో విలేజ్ రెవెన్యూ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. యడ్లపాడు-1 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న షేక్ సుభాని భూ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నడంటూ ప్రజావేదికలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గతనెల 17వ తేదీన సుభానిని సస్పెండ్ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో మండలంలోని కారుచోల రెవెన్యూలో వీఆర్వోగా పనిచేస్తున్న కేపీ చారిని అడ్మినిస్ట్రేషన్ గౌండ్ కింద గ్రామ పరిపాలన సౌలభ్యం నిమిత్తం యడ్లపాడు-1 ఇన్‌చార్జి వీఆర్వోగా నియమిస్తూ శనివారం తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్ఈసీ ఎన్‌సీసీ ఆఫీసర్‌కు లెఫ్టినెంట్ ర్యాంక్



మేడికొండ రాజేష్‌బాబు

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్‌బాబుకు న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ర్యాంక్ కల్పించినట్టు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గుంటూరు గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, ఎన్ఈసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా లెఫ్టినెంట్ ర్యాంక్ బహూకరించినట్టు వివరించారు. లెఫ్టినెంట్ ర్యాంక్ పొందిన రాజేష్‌ను కళాశాల కార్యదర్శి మిట్టపలి రమేష్‌బాబు, 23వ బెటాలియన్ ఏఓ చందు, సీఓ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్, 25వ బెటాలియన్ సీఓ కల్నల్ సిద్దు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ అభినందించారు.

ఆత్మజ్ఞాన సముపార్జనే లక్ష్యం



నరసరావుపేట ఈస్ట్: ఆత్మజ్ఞానాన్ని సముపార్జించటమే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీరామచంద్రమూర్తి (కందుకూరు) తెలిపారు. రెడ్డినగర్‌లోని మైత్రేయ బుద్ధ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ఒకరోజు ధ్యాన శిక్షణ, ఆత్మజ్ఞాన బోధన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ప్రధాన బోధకునిగా హాజరైన శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, ఆత్మజ్ఞానంతోనే సాధారణ మానవుడు మహనీయునిగా మారతాడన్నారు. ఆత్మజ్ఞానంకు మించిన జ్ఞానం లేదని స్పష్టం చేశారు. సమస్త వేదాల సారం ఆత్మజ్ఞానమేనని తెలిపారు. ధ్యానం ద్వారానే శారీరక, మానసికమైన రుగ్మతలు నయమవుతాయన్నారు. పిరమిడ్‌లో ధ్యానం చేయటం ద్వారా త్వరితగతిన ధ్యానస్థితిలోకి వెళతారని వివరించారు. ఈసందర్భంగా అభ్యాసకులకు ధ్యానం చేసే విధానాలను తెలిపారు. కార్యక్రమాన్ని ధ్యానకేంద్రం నిర్వాహకుడు బి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

వై జంక్షన్‌లో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్

నకరికల్లు: మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వై జంక్షన్ వద్ద ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలు నిలిపి తనిఖీలు చేశారు. డ్రైవర్‌లకు బ్రీత్ ఎనలైజర్‌లతో పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిపై ఐదు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రమాదాలు అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ఎదుటివారికి ప్రాణాపాయం తీసుకురావద్దని సూచించారు.

ఈత పోటీల్లో సత్తెనపల్లి వాసులు



సత్తెనపల్లి: విజయవాడలోని దుర్గ ఘాట్ వద్ద కృష్ణా నదిలో ఆక్వా డెవిల్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిలో మీటరన్నర ఈత పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో సత్తెనపల్లి వాసులు షేక్ గని, నిమ్మగడ్డ హనుమంతరావు, కాకుమాను జోజి, పెరుమాళ్ళ శ్రీనివాస్, చంద్రపాటి శ్రీనివాస్, పోతుగంటి నరసింహారావు, కాకర్ల రమేష్, ఆదిరెడ్డి, సాంబశివరావు, రాజేష్ నాయక్, బుజ్జి పాల్గొన్నారు.

ప్రహసనంలా ఆక్రమణల తొలగింపు

- కేవలం రెండురోడ్లకే పరిమితమైన రోడ్ల ఆక్రమణల తొలగింపు
- అధికార పార్టీ, ఆర్థికంగా బలవంతుల జోలికి వెళ్లని అధికారులు
- తొలగించినా.. మళ్లీ పుట్టుకొస్తున్న వైనం
- అన్నింటినీ తొలగిస్తామంటున్న మున్సిపల్ కమిషనర్



ఎన్‌టీఆర్ నగర్ సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌లో ఇంకా తొలగించని ఆక్రమణలు

నరసరావుపేట: నరసరావుపేటలో పురపాలక అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రహసనంగా మారింది. అధికార పార్టీ అండదండలు, ఆర్థికంగా బలం ఉన్న వ్యక్తులు చేసిన ఆక్రమణలను వదిలేసి ప్రతిపక్ష పార్టీ వర్గీయులు, బలహీనులు, అధికార పార్టీ అండదండలు లేని వ్యక్తులకు చెందిన నిర్మాణాలను బెదిరించి నిర్దాక్షిణ్యంగా తొలగించారు. కొందరివి వదిలేసి మరికొందరివి తొలగించటంతో.. తొలగించబడినవారు మళ్లీ రోడ్ల ఆక్రమణకు తీస్తుండటం గమనార్హం. మొత్తం ఆక్రమణల తొలగింపు పేరుతో మున్సిపల్ అధికారులు ఉన్న ఆక్రమణలను గాలికి వదిలేశారనే విమర్శలు పట్టణ ప్రజల నుంచి విన్పిస్తున్నాయి.

హెచ్చరించినా..

సుమారు 1.60లక్షల జనాభా నివాసం ఉండే జిల్లా కేంద్రంలో ప్రధానంగా గుంటూరు, సత్తెనపల్లి, వినుకొండ, చిలకలూరిపేట రోడ్లు, పల్నాడు, స్టేషన్ రోడ్లు ఉన్నాయి. ఇవి మొత్తం చుట్టుపక్కల అయా ప్రాంతాలు, గ్రామాల నుంచి పట్టణంలోకి ప్రజలు, వాహనాలు ప్రవేశించే ప్రధానమైన మార్గాలు. ఈ మార్గాల్లో ఒక్క స్టేషన్‌రోడ్డు మినహా మిగతా అన్నీరోడ్లపై ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గాల్లో పలువురు తమ గృహాలు, స్థలాలు, దుకాణాల ముందు మురుగునీరు పారే డ్రైనేజీలను మూసేస్తూ రోడ్డు మార్జిన్‌ను పూర్తిగా ఆక్రమిస్తూ రోడ్లపైకి నిర్మాణాలు చేశారు. కొందరు రేకులతో షెడ్లు వేసి రూ.వేలకు అద్దెలకు ఇచ్చుకున్నారు. మరికొందరు తాము నిర్వహించే షాపులు, హాస్పిటళ్లు, హోటళ్లకు అవసరమైన విద్యుత్ జనరేటర్లను రోడ్లపైనే ఏర్పాటు చేశారు. ఇవి మొత్తం వాహనాల పార్కింగ్‌కు, ప్రజల రాకపోకలకు ఉపయోగించుకోవాల్సిన మార్గాలు. పురపాలక అధికారులు ఆక్రమణలను తొలగించాలని ప్రకటించిన తర్వాతనే ఆక్రమణదారులకు సుమారు మూడు వారాల గడువు ఇచ్చారు. అధికారుల విన్నపాలను పట్టించుకోని ఆక్రమణదారులు వారు వచ్చినప్పుడు తొలగించవచ్చులే అంటూ కాలయాపన చేశారు. దీంతో గత నెల జనవరి మొదటి వారంలో పొక్లెయిన్ల సాయంతో అధికారులు కొన్ని రేకుల షెడ్లు, దుకాణాలను బలవంతంగా తొలగించటం ప్రారంభించటంతో మిగతా వారు అప్పటికప్పుడు తమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించారు. అధికారుల హెచ్చరికలతో ప్రకాష్‌నగర్ రైల్వేస్టేషన్-ఆర్టీసీ బస్టాండ్ మార్గంలో రిక్షాసెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న ఆక్రమణ దారుల్లో కొందరు మాత్రమే స్వచ్ఛందంగా అధికారులు తొలగించకముందే తమ నిర్మాణాలను తొలగించుకున్నారు.

పట్టించుకోని కొందరు..!

వినుకొండరోడ్డులో జూపల్లి సెంటర్‌లో రోడ్డుపైకి వేసిన రేకుల షెడ్లను తొలగించకుండా అధికారులు వదిలేశారనే విమర్శలు స్థానికుల నుంచి విన్పిస్తున్నాయి. ఇదే మార్గంలో రెండు బార్ అండ్ రెస్టారెంట్లకు చెందిన రేకుల షెడ్లు రోడ్డుపైకి వచ్చినా పట్టించుకోలేదు. దాని తర్వాత వాటిని అధికారులు బలవంతంగా తొలగించి ధ్వంసం చేయటం విశేషం. మరో బార్ అండ్ రెస్టారెంట్ యజమాని తన బార్ పేరుపై ఉన్న నేమ్‌బోర్డును తొలగించి పక్కన పెట్టి కొద్దిరోజుల అనంతరం మళ్లీ ఏర్పాటుచేయటం అధికారులపై అతనికి ఉన్న నమ్మకానికి నిదర్శనంగా కన్పిస్తుంది. మరో వ్యక్తి డ్రైనేజీపై రేకులతో తయారుచేసిన బంకులు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మార్గంలో చాలామంది చిరు జీవులు బతుకుతెరువుకోసం తమ ఇళ్ల ముందు చిన్న దుకాణాలు పెట్టుకొని వాటిపై వచ్చే ఆదాయంతో జీవిస్తుండగా ఆక్రమణల తొలగింపు వారి జీవనాధారాన్ని దెబ్బతీసింది.

- ఎనిమిదో వార్డు వెంగళరెడ్డినగర్‌లో ఓ భక్తురాలు తన ఇంటిముందు ఏర్పాటుచేసుకున్న గుడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందనే స్థానికుల ఫిర్యాదుతో అధికారులు కూల్చివేసి అదే రోడ్డులో మిగతా ఆక్రమణలను పట్టించుకోకపోవటం విశేషం. ఆర్టీసీ బస్టాండ్ ముందున్న మార్కెట్‌యార్డు దుకాణ సముదాయం ముందు ఆక్రమణలను తొలగించిన దుకాణదారులు మళ్లీ చిన్నగా ముందుకు జరుగుతున్నారు.

కొన్ని ప్రాంతాలకే పరిమితం..

ఇదిలా ఉండగా పట్టణం మొత్తం ఆక్రమణలు తొలగిస్తామంటూ ప్రకటించిన అధికారులు వినుకొండరోడ్డు, స్టేషన్‌రోడ్లలో అమలుచేసి, మిగతా రోడ్లలో రోజులు గడుస్తున్నా మొదలు పెట్టకపోవటం గమనార్హం. జిల్లా కేంద్రమైన తర్వాత రోడ్లపై పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని రోడ్ల మార్జిన్లలో ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది. రానున్న రోజుల్లో అధికారులు రాజకీయ ఒత్తిళ్లను అధిగమించి ఆక్రమణలను తొలగిస్తారో లేక బలహీనులు, ప్రతిపక్ష పార్టీలవారివి తొలగించి చేతులు దులుపుకొంటారో వేచి చూడాల్సివుంది.

ఆక్రమణలన్నీ తొలగిస్తాం..

నరసరావుపేట పట్టణంలో ఆక్రమణలన్నీ తొలగిస్తాం. తొలగించిన వాటి స్థానంలో మళ్లీ ఏర్పాటుచేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటాం. పండగలని కొద్దిగా ఆలస్యమైంది. త్వరలో మళ్లీ మొదలు పెడతాం.

– ఎం.జస్వంతరావు, మున్సిపల్ కమిషనర్



వినుకొండ రోడ్డులో జూపల్లి సెంటర్‌లో ఆక్రమణల జోలికి వెళ్లని అధికారులు



జూపల్లి సెంటర్‌లో అధికారుల బెదిరింపుతో షెడ్డును స్వచ్ఛందంగా తొలగిస్తున్న యజమానులు (ఫైల్)



వెంగళరెడ్డి నగర్‌లో ఇంటిముందు ఓ భక్తురాలు నిర్వహిస్తున్న గుడిని ఆక్రమణ పేరుతో కూల్చివేసిన అధికారులు (ఫైల్)

మక్కెన రెండు నాల్కల ధోరణి మానుకోవాలి

- రెండు కులాల మధ్య చిచ్చుపెట్టేలా కుటిల రాజకీయాలు
- అవసరానికి వాడుకుని వదిలేయడం ఆయన నైజం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాదు విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఎన్. ప్రసాదు తదితరులు

వినుకొండ(నూజెండ్ల): అవసరానికి అనుగుణంగా మాటలు మార్చటం మాజీఎమ్మెల్యే మక్కెనమల్లికార్జునరావుకే చెల్లుతుందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాదు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరు అధికారంలో ఉంటే వారి పంచనచేరి అవసరాలు తీర్చుకునే మక్కెన రాజకీయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. రెండునాల్కల ధోరణితో మాట్లాడే వారిని నమ్మాలో వద్దో ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. క్రైస్తవుల అభ్యున్నతి కోసం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కృషిచేసిన విషయం వినుకొండ ప్రజలందరికీ తెలుసన్నారు. చర్చి నిర్మాణం చేసే స్థలంలో ఉన్న విలువను ఎవరు ధ్వంసం చేశారో, క్రైస్తవుల ఆస్తులను ఎవరు అమ్ముకోవాలని చూస్తున్నారో నియోజకర్గ ప్రజలతోపాటు మక్కెను కూడా బాగా తెలుసునని అన్నారు. ఒక పథకం ప్రకారం జరుగుతున్న సంఘటనలను రెండు కులాల మధ్య శాశ్వతంగా దూరం పెరిగేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు, అన్నీ కులాలవారు గమనిస్తున్నారని గుర్తుచేశారు. మీరు ఏదిచెబితే ప్రజలు అదే నమ్ముతారనుకోడం మీ అవివేకమని అన్నారు. 2014–2019 వరకు టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న జి.వి.ఆంజనేయులు ముస్లిం మైనారిటీలకు ఏంచేశారో, 2019 తరువాత బొల్లా బ్రహ్మనాయుడు ముస్లింలకు ఏం చేశారో, వారి అభివృద్ధికి ఎంత కృషిచేశారో ప్రజలకు తెలుసన్నారు. మీ స్వార్థ రాజకీయాలకు అమాయకులను వాడుకుని ఇప్పుడు మాత్రం అసాంఘిక శక్తులుగా చిత్రీకరించడం మీ నీచ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు పక్కనబెట్టి వినుకొండ అభివృద్ధికి కృషిచేయాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధిబుతారని చెప్పారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తుపాకులు కొండల్‌రెడ్డి, భీమని అంకారావు, పలువురు పాల్గొన్నారు.

వైభవంగా తులసి మాత ప్రతిష్టా వేడుకలు



అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అతిథులు

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని పమిడిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీతులసి మాత ప్రతిష్టా వేడుకలు ఆదివారంతో ముగిశాయి. గత మూడు రోజుల నుంచి తులసి మాతకు ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు వేదమంత్రాలు, మేళతాళాల నడుమ గ్రామస్తుల సారథ్యంలో ప్రతిష్టా వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒంటేరు వెంకట శ్రీనివాసరావు కుటుంబానికి చెందిన మూడు తరాలకు ఇలవేల్పుగా పూజలు చేయటం ఆనావాయితీగా వస్తుంది. ఈక్రమంలో పాత గుడి స్థానంలో రూ.50 లక్షల వ్యయంతో సొంత నిధులు కాగా కుటుంబ సభ్యులు, దాతలు సహకారంతో విరాళాలు రూపంలో సేకరించి దేవాలయం నిర్మాణ పనులు చేపట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గోనుగుంట్ల లీలావతి తదితరులు అమ్మ వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తండ్రి మృతికి కారకుడైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

జిల్లా అధికారులకు వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకుల వినతి



వయోవృద్ధుల జిల్లా అధికారి సువార్తకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నరసరావుపేట: నూజెండ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 80 ఏళ్ల కన్నతండ్రిని ఈపూరు వద్ద సాగర్ కాలువలో పడేసి ఉద్దేశపూరకంగా బలవన్మరణానికి కారకుడయ్యాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.చంద్రబాల్, బి.రామసుబ్బారావు కోరారు. ఈ మేరకు వారు శనివారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ప్రతిభావంతుల జిల్లా అధికారి సువార్తలకు వినతిపత్రాలు అందజేశామని ఆదివారం తెలిపారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సమావేశానికి తమ అసోసియేషన్ తరఫున హాజరై తమ వార్షిక నివేదికను అందజేశామన్నారు. కార్యవర్గ సభ్యులు కె.గంగాధర్, ఏవీఎల్ సుబ్రహ్మణ్యం, ఎం.రాధాకృష్ణమూర్తి, షేక్ ఖాశిం సాహెబ్, ఎస్.ఉదయశంకర్, సుభాని మాస్టారు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



డాక్టర్ ఆదిత్య, డాక్టర్ ఇందిరాదేవిని సత్కరిస్తున్న సత్రం కమిటీ సభ్యులు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని వాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం కార్తికేయ డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు గాదంశెట్టి ఆదిత్య, ఇందిరాదేవిలు వైద్య శిబిరంలో పాల్గొని 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంబంధిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సత్రంలో ఆదివారాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమ్మవారి ఆలయ ఈఓ ఎస్.మాధవిదేవిలు పాల్గొన్నారు. మహంకాళి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు సత్రం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కపిలవాయి కాశీరామారావు, రాజా చంద్రశేఖరరావు, ప్రోగ్రాం కన్వీనర్ బత్తుల మురళీ, గాదంశెట్టి రామకృష్ణ, చేగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో ...

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని నారాయణస్వామి మఠం వద్ద ఆదివారం ఉచిత పంటి వైద్య శిబిరం నిర్వహించారు. లక్ష్మమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట చందన డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. దంత వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి సంపత్‌కుమార్‌రాజు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ముందుగా మాజీ సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ చిలకలూరిపేటలోని తమ ఆసుపత్రిలో తక్కువ ఖర్చులో దంత పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నండూరి శ్రావ్యచందన, భీమనబోయిన వెంకటఫణీంద్ర, రుక్సానా పాల్గొన్నారు.

• పంట సాళ్లే వాకిళ్లు.. పొలాలే ఆట స్థలాలు

ఊరి చివర శిథిలమైన రేకుల షెడ్లు.. గోనె సంచులతో వేసుకున్న గుడారాలే వీరి తాత్కాలిక ఆవాసాలు. ప్రతి ఏటా యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల్లో జరిగే పత్తి తీతల్లో, మిర్చి కోతల్లో జీవనోపాధి వెతుక్కుంటూ సుదూర ప్రాంతాల నుంచి తరలి వస్తారు. ఏటా వేసవిలో వచ్చే వలసకూలీలు కోత సాళ్లనే వాకిళ్లుగా మలుచుకుని నిత్యం బతుకుపోరాటం చేస్తుంటారు. వారి పిల్లలు సైతం పొలాలే ఆట స్థలాలుగా భావించి అక్కడే ఆడిపాడతారు. తమ కళ్లెదుటే ఆడుతూ కనిపించే తమ కన్నయ్యలను చూసి, రేయింబవళ్లు చేసిన కష్టమంతా మరిచి పోతారు ఆ పేద తల్లిదండ్రులు. ఆదివారం పలు గ్రామాల్లో కనిపించిన దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– యడ్లపాడు



వేలూరు గ్రామ పొగాకు తోటలో బిడ్డను చూసుకుంటూ పనులు చేస్తున్న తల్లి



బిడ్డల మాటల్ని ఆలకిస్తూ సంతోషంగా నవ్వుతున్న తల్లి



సాళ్ల మధ్యనే ఆటలాడుకుంటున్న అన్నాచెల్లెలు

సువార్త మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘ కాపరి జరుగుమల్లి ఇశ్రాయేలు

సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ 130వ వసంతాల వేడుకలు, నూతన మందిర 4వ వార్షికోత్సవం ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరుగనున్నాయని సంఘ కాపరి రెవరెండ్ జరుగుమల్లి ఇశ్రాయేలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా మూడు రోజులపాటు ప్రతి రోజూ రాత్రి 7 గంటల నుంచి 'రక్షణ ఉజ్జీవ సువార్త మహా సభలు' పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్(చర్చ్ మైదానం)లో జరుగుతాయన్నారు. ఈ సభలకు చెందిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి స్కైలాబ్, కార్యదర్శి కె.ఎం.ఆనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్ బాబు, కోశాధికారి గుజ్జర్లపూడి రవిరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణ పనులకు భూమిపూజ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో బీసీ కాలనీలో జాతీయ ఉపాధి నిధులతో రూ.10 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్స్, కల్వర్టు నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. 250 మీటర్ల సీసీ డ్రైన్స్ పనులు ప్రారంభించామని పొక్లెయిన్ ద్వారా ఇరువైపుల కాల్వ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే మండలంలోని కారుమంచి గ్రామంలో రూ. 23 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు 170 మీటర్ల పనులు జరుగుతున్నాయన్నారు. పనులు ప్రారంభించిన వారిలో గ్రామపెద్దలు గోరంట్ల హనుమంతరావు, ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి శంకరు, కాసరగడ్డ వెంకటరత్నం, వీరయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా ముగిసిన భావనారుషి కలశ మహోత్సవం



గణపవరంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామి

నాదెండ్ల: పద్మశాలీల కులదైవమైన భద్రావతీ సమేత భావనారుషి కలశ మహోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటూ జరిగిన వేడుకల్లో భాగంగా తొలి రోజు కలశానికి శివాలయం వద్ద జలాభిషేకం నిర్వహించి అనంతరం సాంప్రదాయబద్ధ మేళతాళాలతో పద్మశాలీయ వీధిలో వేసిన చలువ పందిరిలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆదివారం రాత్రి పద్మశాలీయ మహిళలు ముూకుళ్లలో ఒత్తులు వేసుకుని దీపారాధన చేశారు. ప్రత్యేక వాహనంలో స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం7 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు అర్ధరాత్రి వరకూ కొనసాగింది. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. ఆకాశదీపాన్ని వదిలారు. గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులకు శాంతినగర్‌లో అవ్వారు సుబ్రహ్మణ్యం అన్నదానం చేశారు. సోమవారం స్వామివారి సమారాధన అనంతరం భారీ అన్నదానం జరగనుంది. పద్మశాలీయ బృహత్తరసేవా సంఘం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం

సత్తెనపల్లి: రాష్ట్రంలో పేదలు అందరికీ ఇళ్ల స్థలాలు సాధించేవరకు సీపీఐ అండగా ఉండి పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లి పాత బస్టాండ్ లో ఉన్న పార్టీ కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాల అర్జీల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లలో రాష్ట్రంలో పలు గ్రామాల్లో, పట్టణాల్లో పేదలకు పక్కా ఇల్లు కావాలని నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం కొన్ని స్కీంలు ప్రకటించిందన్నారు. అవన్నీ కూడా రాష్ట్రంలో సక్రమంగా అమలు కాలేదన్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. సీపీఐ ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు లేని పేదలకు అందజేస్తామని టీడీపీ వాగ్దానం చేసిందన్నారు. ఆ వాగ్దానం అమలుకు నవంబరు ఒకటి నుంచి గ్రామ గ్రామాన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 8 లక్షల మంది పేదల చేత అర్జీలు పెట్టించడం జరిగిందన్నారు. సంబంధింత అర్జీలను 10వ తేదీ ఆయా వార్డులో ఉన్న సచివాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు, ఆర్. శేషగిరిరావు, కంబాల శ్రీనివాసరావు, గండేపల్లి వెంకటరావు, ఇళ్ల స్థలాలు లేని పేదలు ఉన్నారు.